ప్రజాశక్తి





శుక్రవారం 18 అక్టోబర్ 2024 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా



పడమట రైతు బజారులో ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- మంత్రి నాదెండ్ల హెచ్చరిక
- రైతు బజార్, సూపర్ మార్కెట్లో తనిఖీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అధికధరకు సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిరాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. విజయవాడల పడమట రైతుబజార్‌ను, గురునానక్ కాలనీలో ఉషోదయ సూపర్ మార్కెట్‌ను ఆయన గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పెషల్ కౌంటర్ ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. రైతు బజార్లో సరుకులలో వ్యత్యాసంపై ఎస్టేట్ ఆఫీసర్‌ను నిలదీశారు. రైతు బజారులో బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. అలాగే గురు నానక్ కాలనీ ఉషోదయ సూపర్ మార్కెట్ సరుకుల ధరలు పరిశీలించినప్పుడు.. ప్రభుత్వం కందిపప్పు కిలో 67 రూపాయలకు నిర్ణయించిన విధంగా అమ్మకాలు లేకపోవడానికి మంత్రి సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు.. అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన (మిగతా 2లో)

పరిష్కారానికి నోచని విమానాశ్రయ నిర్వాసితుల సమస్య

- సుదీర్ఘకాలంగా పెండింగ్

ప్రజాశక్తి - గన్నవరం : విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఎప్పటి నుండో విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావడంలేదు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ (గన్నవరం) విస్తరణకు 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వం కృష్ణాజిల్లా గన్నవరం మండలం దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం గ్రామాల పరిధిలో 423 కుటుంబాలకు చెందిన ఇళ్లు, స్థలాలు అవసరమవుతాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో నిర్వాసితులకు గృహ నిర్మాణాల నిమిత్తం ఆర్అండ్ఆర్ ప్యాకేజి కింద ఉంగుటూరు మండలం చిన్న ఆవుటపల్లి గ్రామ పరిధిలో అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు 52 ఎకరాలను సమీకరించింది. అనంతరం నిర్వాసితులతో పలుమార్లు చర్చలు జరిపి లాటరీ పద్ధతిలో ఐదు సెంట్ల చొప్పున ప్లాట్లు కేటాయించింది. కానీ సదరు స్థలంలో మెరక పనులు మినహా మౌలిక సదుపాయలు కల్పించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్వాసితులు చెల్లించాల్సిన రూ.3.78 కోట్ల మేర స్టాంప్ డ్యూటీ మినహాయించి ఆ స్థలాలను సంబంధిత వ్యక్తులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులను అందజేసింది. నిర్వాసితుల గృహ నిర్మాణాలకు ఒక్కొక్కరికి రూ.4.50 లక్షల చొప్పున రెండు దఫాలుగా రూ.9 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే గృహ నిర్మాణాలు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయల కల్పనకు రూ.80.48 కోట్లు మంజూరుకు అంగీకరించింది. అయితే నిధులు మంజూరయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో నిధులు విడుదలకాలేదు. అందువల్ల గృహ నిర్మాణాలు పూర్తయితేనే తమ ఇళ్లను ఖాళీ చేస్తామని కొంత మంది నిర్వాసితులు స్పష్టం చేశారు. అలాగే స్థలంలో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస సదుపాయలు కల్పించాలని కోరుతున్నారు. అంతేగాక 30 మంది వరకు అనర్హులకు కూడా స్థలాల రిజిస్ట్రేషన్ చేశారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు. మరికొంత మంది విమానాశ్రయం డ్రెయిన్ కోసం తమ ఇళ్లు ఖాళీ చేసి అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నారు. మరోవైపు విమానాశ్రయ విస్తరణకు దావాజీగూడెం ప్రైవేటు వెంచర్లో నుండి సేకరించిన భూమికి సంబంధించి కూడా సమస్య తలెత్తింది. తమకు భూమికి భూమి ఇస్తేనే వెంచర్ల స్థలాలను ఖాళీ చేస్తామంటూ బాధితులు కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వారి కోసం అజ్జంపూడిలో సుమారు 56 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. కానీ ఆ భూమిని బాధితులకు ఇప్పటికీ అందజేయలేదు. ఆ భూమి ఖాళీగానే ఉండిపోయింది. మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో అడుగు ముందుకు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. భద్రత కారణాల దృష్ట్యా రన్వేకు అతిసమీపంలో ఉన్న ఇళ్లను తొలగించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా ఎప్పటి నుంచో అధికారులపై ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విమానాశ్రయ నిర్వాసితులు కోరుతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చిన స్థలాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏలూరు కాల్వపై కొత్త వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అజ్జంపూడిలో సేకరించిన స్థలాలను కూడా లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు.

లబ్ధిదారులకు పంపిణీ చేయని భూమి





నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర

దీపావళి నుండి ఉచిత గ్యాస్ అమలు

మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : దీపావళి నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గుడ్లవల్లేరు మండలం కవుతరంలో రూ.23 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడుతూ వందేళ్లకుపైగా చరిత్ర గల సబ్ రిజిస్ట్రార్ భవనాన్ని ఆధునీకరించినట్లు తెలిపారు. అలాగే పిఎసిఎస్ ఆధ్వర్యంలో హెచ్పీసీఎల్ బంక్ ప్రారంభించుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గుడివాడ అభివద్ధి కుంటుపడిందన్నారు. ఆర్థిక స్థిరత్వం లేని పరిపాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రతి పంచాయతీలో గ్రామసభలు పెట్టి 15వ ఆర్థిక సంఘం (మిగతా 2లో)

ఆరుద్ర శత జయంతి సందర్భంగా

నేడు 'ప్రజాకళలు - సాహిత్యం'పై సభ

ప్రజాశక్తి - విజయవాడ : సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు నగరంలోని గవర్నరుపేట బాలోత్సవ్ భవన్ 2వ అంతస్తులో ఆరుద్ర శత జయంతి సభ జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా "ప్రజా కళలు – సాహిత్యం" అన్న అంశంపై ప్రముఖులు మాట్లాడతారని, ప్రధాన వక్తగా సాహితీ స్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి పాల్గొంటారని తెలిపారు. అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం.వి.ఎస్.శర్మ ఆత్మీయ వాక్యం పలుకుతారని తెలిపారు.

ఎంపిని కలిసిన కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి

ప్రజాశక్తి - విజయవాడ : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణాజిల్లాకు ఇన్చార్జి మంత్రిగా నియమితులైన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో కేశినేనిని కలిశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఎంపి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. అలాగే ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేయాలని చరించుకున్నారు.



ఎన్‌టిఆర్ నూతన కలెక్టరెవరు?

తెలంగాణ సిఎస్‌కు రిపోర్టు చేసిన సృజన

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఎవరనే దానిపై తీవ్ర చర్చ ప్రారంభమైంది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ ఇమాన్ను శుక్లా, ఇంటర్మీడియట్ బోర్డులో పనిచేస్తున్న కతికా శుక్లా, సిఆర్‌డిఎ మాజీ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ పేర్లు వినిపిస్తున్నాయి. కొత్తగా తెలంగాణ నుంచి వచ్చేవారి కంటే.. ఇక్కడి వారినే నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ జి.సృజన తెలంగాణా కేడర్‌కు చెందినవారు కావడంతో మార్పు అనివార్యమైంది. తెలంగాణకు వెళ్లకుండా తమను ఎపిలోనే ఉండేవిధంగా కేంద్రంతో మాట్లాడాలని సిఎం చంద్రబాబును ఇటీవల కలెక్టర్ డాక్టర్ సృజన కోరిన విషయం తెలిసిందే. పలు రూపాల్లో ప్రయత్నాలు చేసినా, చివరకు తెలంగాణ హైకోర్టు కోర్టు తీర్పు ఐఎఎస్‌లకు అనుకూలంగా రాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ డాక్టర్ సృజనను రిలీవ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆమె తెలంగాణ చీఫ్ సెక్రటరీకి రిపోర్టు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా సృజన నియమితులయ్యారు. ఈ ఏడాది జూలై 26న ఆమె బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా మూడు నెలలు పనిచేశారు. వచ్చీ రాగానే జగ్గయ్యపేటలో అతిసార ప్రబలడం, అక్కడే అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ ప్రమాదం జరిగి పలువురు మరణించడం, పరిటాల క్వారీలో కొండచరియల ప్రమాదం, విజయవాడలో కొండచరియలు విరిగిపడటం, కష్ణానది, బుడమేరు వరదలు వంటి పరిణామాలను ఆమె ఎదుర్కొన్నారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు ఇన్చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.



కూలిన ప్రహరీ గోడను వెంటనే నిర్మించాలి : సిపిఎం రాష్ట్ర నేత కాశీనాథ్

మహిళా హాస్టల్ గోడ కూలి ఐదు కార్లు ధ్వంసం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని సూర్యారావుపేటలో కూలిన హాస్టల్‌లో ప్రహరీగోడను వెంటనే నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. గోడ కూలిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉండే హాస్టల్ అయినందున వారి రక్షణ నిమిత్తం వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.కాగా, విజయవాడ సూర్యారావుపేటలోని కోర్టు భవనాల సముదాయం ఎదురుగా ఉన్న కమల నెహ్రూ మహిళా హాస్టల్ ప్రహరీగోడ బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కూలిపోయింది. తరచూ కురుస్తున్న వర్షాలకు తోడు సమీపంలో ఉన్న డ్రైనేజి కారణంగా కారణంగా ప్రహరీ గోడ కూలిపోయింది. దీంతో ప్రహరీ గోడ వెంట పార్కింగ్ చేసి ఉన్న ఐదు కార్లు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని నగరపాలక సంస్థ అధికారులు పరిశీలించారు. అనధికారికంగా రోడ్డు పక్కన పార్కు చేసిన వాహనాలకు నగరపాలక సంస్థ నుంచి ఎటువంటి నష్టపరిహారం చెల్లించబోమని అధికారులు స్పష్టం చేశారు.

సమ్భవ్ హ్యాకథాన్2024ను ప్రారంభించిన అమెజాన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ-కామర్స్‌లో భారతీయ చిన్న, మధ్యస్థ వ్యాపారాల కోసం నెక్స్ట్ జెన్ టెక్, ఏఐ శక్తితో కూడిన ఆవిష్కరణలను రూపొందించడానికి సమ్భవ్ హ్యాకథాన్ - 2024ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఈ హ్యాకథాన్ భారతదేశంలో జరిగే సంస్థ ప్రధాన వార్షిక శిఖరాగ్ర సదస్సు ఐదో ఎడిషన్ అయిన అమెజాన్ సమ్భవ్ 2024కి లీడ్ అప్‌లో భాగంగా ఉంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వద్ధికి దోహదపడేందుకు దేశవ్యాప్తంగా ఆవిష్కర్తలను ఆహ్వానిస్తుంది. దీని కోసం స్టార్టప్ ఇండియా, డీపీఐఐటీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఇండియా, ఎన్ఐఎఫ్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కౌన్సిల్‌తో అమెజాన్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

ఇసుజు మోటార్స్ నుంచి డి-మ్యాక్స్ అంబులెన్స్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పూర్తిగా ఏఐఎస్-125 టైప్ సి అంబులెన్స్ నిర్దేశనలతో నిర్మించిన ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్ ప్రారంభాన్ని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రకటించింది. ఈ మార్గదర్శకమైన ఆంబులెన్స్ అత్యవసర వైద్య సంరక్షణ సేవలలో ఒక కొత్త ప్రామాణికాన్ని ఏర్పరుస్తూ, రోగుల రవాణాలో అసమానమైన విశ్వసనీయత, భద్రత, సౌకర్యాన్ని అందించే వేగవంతమైన స్పందనను అందించేందుకు తయారు చేశారు. ఇసుజు నిరూపిత సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ అందించేవారికి అవగాహనతో కొత్త ఇసుజు డి-మ్యాక్స్ ఆంబులెన్స్ రూపొందించబడింది. ఇది దేశంలో 'బేసిక్ లైఫ్ సపోర్ట్' ఆంబులెన్సులలో ఒక కొత్త యుగాన్ని ప్రారంభించే 14 'బెస్ట్-ఇన్-క్లాస్' లక్షణాలతో వస్తోందని ఇసుజు మోటార్స్ ఇండియా డెప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషిమోటో పేర్కొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

- **ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా**
- **పలుచోట్ల వాల్మీకి జయంతి**



చిత్తరంజన్ గ్రంథాలయంలో

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్ : మహర్షి వాల్మీకి జీవితం.. ఆయన సమాజానికి అందించిన రామాయణ మహా కావ్యం గొప్ప స్ఫూర్తిదాయకమని ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా పేర్కొన్నారు. నగరంలో పలుచోట్ల గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా.నిధి మీనా అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీనివాస రావు, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, డీసీహెచ్ఎస్ డా. బీసీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పోలీస్ కమీషనర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు, ఎడిసిపిలు తదితరులు పాల్గొన్నారు. గుణదల ఇఎస్ఐ ఆస్పత్రిలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.జ్యోతి, ఆర్ఎంఒ ఉప్పులేటి తారక ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో మహర్షి చిత్ర పటానికి గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కే రమాదేవి, గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా



నివాళులర్పిస్తున్న విఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర



నివాళులర్పిస్తున్న ఇఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.జ్యోతి, ఆర్ఎంఒ ఉప్పులేటి తారక ప్రసాద్

దళితుల సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఎ.కొండూరు : తరతరాలుగా పెద్ద బీడు భూములు సాగుచేసుకుని జీవిస్తున్న పాత కొండూరు దళిత రైతులకు ఆన్‌లైన్ చేసి పట్టా, పాస్ పుస్తకం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏ కొండూరు తహశీల్దారు కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు మద్దతు తెలియజేశారు. ఈ ధర్నాలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 50 సంవత్సరాల నుంచి ఏ కొండూరు రెవెన్యూ ఆర్ఎస్ నెంబర్ 173లోని 50 ఎకరాలు భూమిని సుమారు 129 మంది సన్న, చిన్నకారు దళిత రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూమిని వెంటనే ఆన్‌లైన్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో లేకపోవడం వలన రైతు భరోసా కానీ, వ్యవసాయానికి సంబందించిన రాయితీలుగానీ ఆ రైతులకు రావడంలేదన్నారు. అనేక సంవత్సరాల నుండి తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఆన్‌లైన్ చేయలేదన్నారు. ధర్నా అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో వేంపాటి వెంకటేశ్వరావు, వి.సతీష్, సుజానరావు, చిన్న వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



ఎ.కొండూరు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గౌరంగబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రవాణాశాఖ కార్యాలయం గన్నవరంలో కాకుండా విజయవాడ నగరంలో నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వాన్ని ఒప్పించి, ప్రభుత్వానికి నిధులకొరత తలెత్తినపుడు లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా 38 లక్షల రూపాయల మొత్తాన్ని సేకరించి బందరురోడ్డులో డి.టి.సి. శాశ్వత భవననిర్మాణం చేసిన యలమంచిలి గౌరంగబాబు చిరస్మరణీయులని కొనియాడుతూ పలువురు నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, దుర్గగుడి మాజీ ఛైర్మన్, ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, లారీ ఓనర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ మాజీ డైరెక్టర్ యలమంచిలి గౌరంగబాబు సంస్మరణసభ గురువారం లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగింది. లారీ యజమానుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, జిల్లా సంఘం అధ్యక్షులు నాగుమోతు రాజా ఆధ్వర్యాన జరిగిన ఈ సభలో ఎంఎల్ఏ గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు లారీ ఓనర్స్ స్టోర్స్ ఛైర్మన్ కెవి రమేష్, ఫౌండేషన్ అధ్యక్షులు రావి గోపాలరావు, స్టీరింగ్ కమిటీ పెద్దలు పి.ఎస్.వి. ప్రసాదరావు, కోనేరు బసవేశ్వరరావు, మస్తాన్ రావు, చెన్నుపాటి వజీర్, చలువాది మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ నాలుగోవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోరు, విజయవాడ.
O.S No. 896 of 2023
బిట్వీన్:
పంజాబ్ నేషనల్ బ్యాంక్, రిప్రజెంటెడ్ బై మేనేజర్, కాన్వెంట్ స్ట్రీట్ బ్రాంచ్, విజయవాడ ... వాది
మరియు
అత్మురి శ్రీనివాసరావు అండ్ another....ప్రతివాదిలు
1 వ ప్రతివాది: అత్మురి శ్రీనివాస రావు, తండ్రి: రత్తయ్య డోర్ నెంబర్ 41-1/11-22, నెహ్రూ నగర్, 2వ లైన్, కృష్ణ లంక, విజయవాడ,
2 వ ప్రతివాది: అత్మురి నాగ ప్రియాంక, భర్త: అత్మురి శ్రీనివాస రావు, డోర్ నెంబర్ 41-1/11-22, నెహ్రూ నగర్, 2వ లైన్, కృష్ణ లంక, విజయవాడ,
పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి సామాన్లు అందజేయు నిమిత్తం ది. 29- 10-2024 తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం : 10:30 లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)
ఇట్లు
బి.వి.ఎస్.ఆర్.ప్రసాద్
వాది తరఫున అడ్వకేట్,
విజయవాడ.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISON) AT VIJAYAWADA
E.P. No. 297/2023 in ACP No. 144/2022
Between :
shriram Chits Pvt. Ltd., Onetown Branch, Vijayawada .... D.H.R.
And
K.Kanaka Durga & Others .... J.D.R.
To,
J.D.R. No.5 : Ch.Sambasiva Rao, S/o Ch.Venkateswara Rao, Hindu, aged about 40 years, Occupation : Employee in South Central Railway Vijayawada, Designation : Welder-II Mechanical Dept, R/o D.No. 6-22, Babu Jagajeevan Rao Street, Near C.S.I. Church Kothuru, Elaprolu, Kothuru (Post), G.Konduru Mandal, Krishna Dist.
పై నెంబరు ఇ.పి.లో డిహెచ్ఆర్ కంపెనీ వారు జెడిఆర్-2పై డిక్రీ బాకీని ఖర్చులతో రాబట్టుకొనుటకు U/or R21 R48 CPC ప్రకారం దాఖలు చేయగా అందుపై ఇ.పి.తో 5వ జెడిఆర్‌కు U/or R21 R48 CPC ప్రకారం నోటీసుల నిమిత్తం ది. 06-11-2024 శ్రీ కోర్టువారు వాయిదాగా వేసివున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు 5వ జెడిఆర్ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై తమకు గల ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేని యెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియపరచట మైనది.
వాయిదాతేది : 06-11-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
డి.రాజశేఖర్,
అడ్వకేట్, విజయవాడ.

మొదటిపేజీ తరువాయి

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందించాలన్నారు. బహిరంగ మార్కెట్లలో నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు అన్ని రైతు బజార్లలో వంట నూనెలు, కందిపప్పు, ఉల్లి, టమాటాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె చౌక ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పామాయిల్ లీటర్ రూ.110, సన్ ఫ్లవర్ ఆయిల్‌ను లీటర్ రూ.124, కిలో కందిపప్పు రూ.67లకే వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దీపావళి నుండి ఉచిత గ్యాస్ అమలు

నిధులు గ్రామపంచాయతీలకు అందించి, సర్పంచుల ఆత్మగౌరవం నిలబెట్టారని చెప్పారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.4500 కోట్లతో 30 వేల అభివద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన భూముల అక్రమాలపై గ్రామాల్లో అధ్యయనం చేస్తున్నామని, భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ కావాలని స్థానిక ఎంఎల్ఏ అడిగారని, గుడివాడ అభివద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దోచుకున్న భూములపై విచారణ జరిపి, వాటికి విముక్తి కలిగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో శాసనసభ్యులందరి సహకారంతో బందరు పోర్టు పనులు పూర్తి చేస్తామని, గుడివాడ నియోజకవర్గ అభివద్ధికి కషి చేస్తామని అన్నారు. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సురేంద్రబాబు, బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జి, వల్లభనేని బాబురావు, మల్లిపెద్ది సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిఐజి రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్ గోపాలకష్ణమూర్తి, సబ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రావు, జిల్లా సహకార శాఖ అధికారి కె చంద్రశేఖర రావు, డివిజనల్ సాకార అధికారి వివి ఫణి కుమార్, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, తహశీల్దారు బి.లోకరాజు, ఎంపీడీవో ఇన్చార్జి విజయసారథి పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులు వద్దని నిరసన



చల్లపల్లి మండలం రామానగర్‌లో ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-చల్లపల్లి : నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధమవుతుండగా మహిళలు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో నివాస గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు నిర్వాహకులు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు నివాస గృహాల మధ్య మద్యం షాపు పెట్టరాదు అంటూ గురువారం 216 జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో జరిపిన చర్చలు జరిపారు. ప్రజాశక్తి - గుడివాడ : నివాసాల మధ్య వైన్ షాప్ పెట్టడం దారుణమని వెంటనే మద్యం షాపును తొలగించాలని మహిళలు నిరసన తెలిపారు. గురువారం స్థానిక గుడివాడ - విజయవాడ రోడ్డులోని బేతవోలు వాటర్ ట్యాంక్ వద్ద గృహాల మధ్యలో ఏర్పాటు చేసిన వైన్ షాపును వెంటనే తొలగించాలని స్థానిక మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి పి రజిని మాట్లాడుతూ నివాస గృహాల మధ్యన మద్యం షాపు ఏర్పాటు చేస్తే చుట్టుప్రక్కల ఉన్న కుటుంబాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ సంఘటనతో గుడివాడ విజయవాడ ప్రధాన రహదారిలో సుమారు కిలోమీటరు దూరం ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



గుడివాడలో ఆందోళన చేస్తున్న దృశ్యం



సాయం అందిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోడూరు : అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన నక్కవానిదారి గ్రామస్తులు పచ్చ వీరబాబు కుటుంబానికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ వీవియర్ ట్రస్టు ద్వారా పదిహేను వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. కొద్దిరోజుల క్రితం పచ్చా వీరబాబు ఇల్లు పశువుల ఛావిడి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి కాగా ప్రమాదంలో ఇంటిలో సామగ్రి, ఆస్తి పత్రాలు, చావిడి లోని నాలుగు గేదెలు, మోటార్ సైకిల్, సైకిళ్ళు కాలి బూడిద అయ్యాయి. వీరబాబు కట్టు బట్టలతో మిగిలడంతో అతని పరిస్థితి గురించి స్థానికుల ద్వారా తెలుసుకున్న శ్రీనివాస్ ఆ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ది భాస్కరరావు, బడే వీరబాబు, నాగం బాపయ్య, శివరామ కృష్ణ, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. అర్థశాస్త్రం విభాగం అధిపతి ఏ వీరకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లలో పేదరికం ఒకటి అని, పేదరికం అంతం చేయడానికి విద్యా వైద్య సౌకర్యాలు కల్పించడ,ం ఆర్థిక క్రమశిక్షణ పాటించటం ముఖ్యమైన మార్గాలు అని వీర కుమారి సూచించారు. అదేవిధంగా గ్రామీణులకు విద్య ఆవశ్యకతను ఆరోగ్య పథకాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ అభియాన్ పేదరిక నిర్మూలన పథకాల గురించి వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజి సమస్య లేకుండా చూడాలి : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నియోజకవర్గంలో లో వోల్టేజ్ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి నగరంలోని వారి నివాసంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రివ మాట్లాడుతూ నియోజకవర్గ మచిలీపట్నం నియోజక వర్గంలో లో వోల్టేజీ సమస్య లేకుండా కొత్త సబ్ స్టేషన్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మచిలీపట్నం వైద్య కళాశాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రుద్రవరం గృహ నిర్మాణ కాలనీలో గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించి అక్కడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునేలా ప్రజలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో సిపిడిసిఎల్ ఎస్ ఈ, సత్యానందం, ఈఈ లు శ్రీనివాసరావు, బి వి సుధాకర్,డిఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మహర్షి వాల్మీకికి ఘన నివాళి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవశ్యకత ప్రస్తుత సమాజానికి ఎంతైనా ఉందని కృష్ణా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి జి.రమేష్ పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం గురువారం ఆ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు వాల్మీకి/బోయ సంఘ నాయకులు కే.బ్రహ్మానందంగారు, కే.రామకష్టా, బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శంకర్రావు,జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణి ధూర్జటి,మరియు వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కలక్టర్ కార్యాలయ ఆవరణలో : కలెక్టరేట్ లోని విసి హాల్‌లో జిల్లా రెవిన్యూ అధికారి కె. చంద్రశేఖర రావు, కెఆర్ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి కలెక్టరేట్ సిబ్బంది ,వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ఎస్.వెంకట రావు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు తో వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : రామాయణం రచించిన వాల్మీకి జయంతిని అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాల అధికారి జె ప్రభుదాస్ నేతృత్వంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డీఎస్సీ విద్యార్థులు పాల్గొని వాల్మీకి జీవన విశేషాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డీఎస్సీ అభ్యర్థులు, పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కొడాలి సురేష్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో విజయసారథి, కార్యదర్శి ఏఔఎల్ నరసింహారావు, అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని బీసీ భవన్‌లో...



గుడ్లవల్లేరు మండలంలో...

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పులూరు- నిడమనూరు రైల్వే స్టేషన్‌ల మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని కుడి చేతికి స్టీల్ కడియం, ఎరుపు రంగు తాడు ఉన్నట్లు, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి, గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా మతుని సమాచారం తెలిసిన ఎడల గుడివాడ రైల్వే ఎస్సై సెల్ నెంబర్ 9440627570 తెలియజేయాలన్నారు.

అసత్య ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-పెడన : తనపై అసత్య ఆరోపణలు చేసిన మామిడి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లోని ఎస్సై సత్యనారాయణకు లిఖితపూర్వకంగా అర్జీని దాఖలు చేశారు. ఈనెల 16వ తేదీన కొన్ని పత్రికలలో (ప్రజాశక్తి కాదు) తనపై టిడిపి కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లుగా అసత్య ఆరోపణలు వెలువరించారన్నారు. అసత్య ఆరోపణలు ప్రచార మాధ్యమాల్లో రావడంతో ప్రజలందరూ వాటిని సత్యం అనుకొని తన దష్టికి తీసుకొచ్చారన్నారు. దీని వలన పరువు, గౌరవానికి బంగం కలిగించిందని అసత్య ఆరోపణ చేసిన సత్యనారాయణ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నట్లు కటకం ప్రసాద్ చెప్పారు.

టిడిపి నాయకుడి ఇంటి వద్ద రెక్కీ



రెక్కీ నిర్వహించిన వ్యక్తి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండల టీడీపీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు నివాసం ఉండే అపార్ట్మెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రెక్కీ నిర్వహించటం సంచలనం కలిగించింది. ఇటీవల కాలంలో ఆయన మద్యం టెండర్ల విషయంలో అధికార పార్టీ పేరుతో యువకులు చేసిన దాడులకు వ్యతిరేకంగా నిలబడ్డారు. టెండర్లు వేసే విషయంలో పార్టీ నాయకులకు అండగా ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు కదలికలపై నిఘా పెట్టి రెక్కీ నిర్వహించాడు ఓ వ్యక్తి. గురువారం టిడిపి నాయకుడు వెంకటేశ్వరరావు నివాసం ఉండే అపార్టెంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి కూరగాయల సంచి తీసుకువెళ్లి తిరుగుతూ ఉండడాన్ని వాచ్మెన్ గమనించాడు. వాచ్ మెన్ సమాచారంతో అప్రమత్తమైన అపార్టమెంట్ వాసులు అతన్ని పట్టుకుని పోలీస్ లకు అప్పగించారు. పోలీసుల విచారణలో అతను ఒక దొంగ అని తెలిసింది. దొంగతనాలు చేయడం, సైబర్ నేరాలకు పాల్పడడం, ప్రత్యేకమైన వ్యక్తులపై రెక్కీలు నిర్వహించడం చోరీలకు పాల్పడం వంటి కార్యక్రమాలకు అతను తెగబడతాడని కనిపెట్టారు. అతనిపై పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. గన్నవరం సిఐ శివప్రసాద్ పూర్తిగా విచారణ చేపట్టారు. అతను ఎవరు? ఎందుకు జాస్తి వెంకటేశ్వరరావుపై రెక్కీ నిర్వహించాడు అన్న అనుమానాలపై విచారణ సాగిస్తున్నారు.

మేరీ రాయ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని పెనమకూరు గ్రామానికి చెందిన మట్టా అడియల్ మేరీ రాయ్ (69) అనారోగ్యంతో మృతి చెందారు. ఉన్నత చదువులు చదివి ఎస్ ఆర్ ఆర్ అండ్ సివిఆర్ గవర్నమెంట్ కాలేజీలో వక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేశారు. ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దిన ఆమె మతి కి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వద్ద చదివిన విద్యార్థిని విద్యార్థులు తోటి సహచర అధ్యాపకులు ఆమె మతదేహానికి నివాళులర్పించారు. ఆమె అధ్యాపకురాలు గానే కాకుండా రీడర్ గా రిటైర్డ్ అయ్యారు.

ఎంపిని కలిసిన ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని)ని విజయవాడలోని వారి కార్యాలయంలో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా



అధ్యక్షులు సామినేని ఉదయభాను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమములో విజయవాడ జనసేన నాయకులు వక్కల గాంధీ, బడిత శంకర్ పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో జివిజె జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్‌లో శ్రీ పూర్ణానంద బాదే సత్యనారాయణ, వీరమ్మల పేరున



కళావేదికను వారి కుమారుడు బాదే నాగేశ్వరరావు నిర్మించారు. గురువారం కళావేదికను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. కళా వేదిక దాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని కన్నెవీడు గ్రామంలోని కర్నాటి వెంకట సూర్యప్రకాష్‌రావు ఇంటి వద్ద సిపిఎం గ్రామ శాఖ సమావేశం



కరిసే రత్నబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శిగా రాయల సుదర్శనను ఎన్నుకున్నారు. అనంతరం ఐదు తీర్మానాలు ఏక గ్రీవంగా ఆమోదించారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదను నివారించాలని, ఇటీవల వచ్చిన వరదల కారణంగా రైతుల రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని, రైతులకు రుణాలు రీ షెడ్యూల్ చేయాలని, కన్నెవీడులో శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలని, డొంక రోడ్లు బాగు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి.రాము తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు



ప్రజాశక్తి-గంపలగూడెం: నెమలిలో విలసిల్లుతున్న శ్రీ వేణుగోపాల స్వామి హుండీలను గురువారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. జూన్ 13వ తేదీ నుండి ఇప్పటివరకు రూ.22,59,090 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సిఎం చిత్రపటానికి పట్టణంలోని స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి శేషగిరిరావు (చిన్నా) ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవోజు శశి, బాజీ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.


ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-వీరులపాడు: ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు మోహన్ వెంకటకృష్ణ కోరారు. గురువారం జుజ్జూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను అనేక దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా జాప్యం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం 2021 ఆగస్టులో జిఓ 50ను విడుదల చేసి ఎయిడెడ్ పాఠశాలలను చాలా వరకు మూసివేసిందన్నారు. దీని వల్ల విద్యార్థులకు, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయ సిబ్బందికి అన్యాయం జరిగిందన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ఉన్న మండలంలోనే ఎయిడెడ్ ఉపాధ్యాయులను సమీప ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయాలన్నారు. నూతన ప్రభుత్వం అయినా విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఇసుక కొరతను తీర్చాలి : సిఐటియు

ప్రజాశక్తి-తిరువూరు: ఇసుక కొరతను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్మికులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇసుక లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తమకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనితో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయించి కార్మికులకు పని కల్పించాలని, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు కొనసాగించాలని సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు కోరారు. ఈ కార్యక్రమంలో బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ తిరువూరు మండల అధ్యక్షులు నల్లగొర్ల వేలాద్రి (బద్రి) తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఉచిత ఇసుకను అమలు చేయాలని కోరుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇసుక ధరలు అందుబాటులో ఉండేలాగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.రాము, ఎస్. రామనాధం, కె.రవి, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-వత్సవాయి: మంగొల్లు గ్రామంలో పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 35 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు పనులకు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ భూమిపూజ చేశారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు, రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనుల్ని చేపట్టనున్నట్టు వివరించారు. **నందిగామ:** పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య తెలిపారు. మండలంలోని కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లో సీసీ





రోడ్డు పనులకు జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. మండలంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ప్రకటించారు. సుమారు రూ.60 లక్షలతో కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లో అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మండలంలోని గోళ్లమూడి, సోమవరం, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో తోట నాగమల్లేశ్వరరావు, గాడిపర్తి శ్రీనివాసరావు, ఉప్పుకొండూరు గురుప్రసాద్, బత్తిన రవి, అబ్బూరి నాగమణి, వేల్పుల బిక్షాలు, మల్లేశ్వరరావు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి-ఈలప్రోలు రోడ్డులోని జగనన్న సెంటు స్థలాల్లో ఇటీవల వరదలకు తీవ్రంగా నష్టం జరిగిందని, వరద సాయం కొద్ది మంది కి మాత్రమే వచ్చాయని వారికి తక్షణమే ఇవ్వాలని, అంతర్గత రోడ్లు బురదతో అధ్వానంగా ఉన్నాయని తక్షణమే గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోకి సెంటు స్థలాలను తీసుకోవాలని అక్కడ మంచినీరు పంపు లైన్, రోడ్లు, అంగన్వాడీ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఏ ఎన్ యం ను ఆశా వర్కర్ ని) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లు బురద మాయంగా ఉండటం తో మహిళలు, వద్దులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే తక్షణమే



స్పందించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బాలాజీ, దేవి, సూర్య, శంకర్, రమణ, తులసి, నీలవేణి, శివ దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఎల్‌విపిఇఐ నేత్ర సంరక్షణ సేవలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

రోగుల ఇంటి వద్ద సమగ్ర నేత్ర సంరక్షణను ప్రత్యక్షంగా అందించే ఉద్దేశ్యంతో 'ఎల్‌విపిఇఐఎహోమ్' అనే పేరుతో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) నేత్ర వైద్య సేవలు ప్రారంభించింది. ఈ మేరకు ఎల్వీపీఈఐ స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్‌తో భాగస్వామ్యం చేసుకుంది. ఈ సందర్భంగా ఎల్విపిఇఐ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ గర్గ్, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ ప్రతినిధి కరుణా భాటియా మాట్లాడుతూ ముఖ్యంగా వద్ధులు, చలన సంబంధిత సమస్యలున్న వారికి నాణ్యమైన కంటి ఆరోగ్య సంరక్షణ అందుబాటును వద్ధి చేయడానికి 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' కార్యక్రమంపట్ల బ్యాంక్ నిబద్ధతలో ఈ కార్యక్రమం ఒక కీలక భాగం అన్నారు. వృద్ధుల సంరక్షణలో పెరుగుతున్న డిమాండ్ తీర్చడానికి, సాంప్రదాయక ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై ఒత్తిడిని తగ్గించడానికి ఎల్విపిఇఐ ప్రాంగణం నుంచి నడపబడే ఎల్విపిఇఐఎహోమ్ వంటి వినూత్న ఆరోగ్య సంరక్షణా నమూనాలు కీలకమైనవిగా చెప్పారు. ఎల్విపిఇఐఎహోమ్ సేవలు సంస్థకు ఒక ఫోన్ కాల్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చునని, దాని తరువాత శిక్షణ పొందిన ఒక విజన్ టెక్నీషియన్ లేదా ఆప్టోమెట్రిస్ట్ రోగి ఇంటిని సందర్శించి, ఒక సమగ్ర కంటి పరీక్ష చేస్తారని తెలిపారు.

నష్టపరిహారం కోరుతూ వరద బాధితుల ధర్నా

ప్రజాశకి-భవానీపురం: బుడమేరు వరదలు వచ్చి 47 రోజులుగా దాటినా వైఎస్ఆర్ కాలనీ వరద బాధితులకు నష్టపరిహారాల ఇంతవరకూ చెల్లించకపోవటం బాధాకరమని సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. ఈ సందర్భంగా గురువారం వైఎస్ఆర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాలనీలో వరద బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ వరద సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు ఇంతవరకూ న్యాయం చేయకపోవటం సరికాదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. బాధితులకు నష్టపరిహారాలు వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ఓట్ల కోసం ఇంటింటికి నోట్లు పంచే ఎమ్మెల్యేలు, ప్రభుత్వాలు నష్టపరిహారాల కోసం 47 రోజులుగా ఆఫీసుల చుట్టూ తిప్పడం, బ్యాంకుల చుట్టూ తిప్పడం ఇదేనా వరద బాధితులు ఆదుకునే విధానమని ప్రశ్నించారు. ఇసుక, మద్యం, సిండికేట్ దోపిడిలో పాలకులు మునిగి తేలుతున్నారన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి మండలి ముఖ్యమైన వరద బాధితుల సహాయ విషయమై



సమీక్షించకపోవడం ఏమిటన్నారు. కలెక్టర్ ఆఫీస్‌కు, సచివాలయాలకు దరఖాస్తులు చేసిన వేలాది మంది అప్లికేషన్లు కనీసం విచారణ కూడా చేయకుండా బుట్ట దాఖలు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. వరదలకు నష్టపోయిన చిరు వ్యాపారులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల కరెంటు బిల్లులు మాఫీ చేయాలని, వైఎస్ఆర్ కాలనీలో అన్న క్యాంటీన్ ఉచిత భోజన కేంద్రం ఏర్పాటు చేయాలని, డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సక్రమంగా మంచినీరు సరఫరా చేయలని కోరారు. అలాగే 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లో వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కూడా సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, అప్పలరాజు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మికుల వినతి





పెడన ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్, పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజాకు వినతిపత్రాలు కార్మికులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కి ఆయన నివాసంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును యధాతథంగా కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమ్మాలపాటి రవి, షక్ షమీం, జి .ఎన్. శేషుబాబు, ముక్కొల్లు మురళి, ఎర్రం శెట్టి బాబురావు, సూరిబాబు, బాలసుబ్రమణ్యం, వై. నానాజీ, సాంబశివరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి, మొవ్వ :** సమస్యలు పరిష్కరించాలని కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు.జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వి. పెదబాబు, ఖాన్, కాకి రాజశేఖర్, ఇంటి రాజు, ముళ్ళపూడి విల్సన్,తోట శ్రీనివాసరావు, వైవివి ప్రసాద్, పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వినతి పత్రాన్ని అందజేశారు. కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి గోపాలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, పట్టణ కార్యదర్శి రేపాని కొండ, పట్టణ అధ్యక్షులు దాస్ శ్యాంప్రసాద్, గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మండల సత్యనారాయణ, చంద్రగిరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్షిపణి కేంద్రంతో జిల్లాకు మహర్దశ : విక్కుర్తి



యాగయ్యను అభినందిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండలం గుల్లలమోద లో క్షిపణి పరీక్ష కేంద్రంతో కృష్ణా జిల్లాకు మహర్దశ వచ్చినట్టేనని ప్రముఖ పారిశ్రామికవేత్త వివిఆర్ ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి శ్రీనివాస్ తెలిపారు. డిఆర్‌డిఓ సౌత్ ఇండియా సిసి ఈ హెడ్ యాగయ్యను కలసి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్షిపణి పరీక్ష కేంద్రంతో కారణంగా గన్నవరం వద్ద డిఆర్డిఓ అతిథి గహం, శాస్త్రవేత్తల గహాల నిర్మాణం జరపడంతో పాటు గన్నవరం నుంచి గుల్లలమోద వరకు రహదారులు అభివద్ధి మచిలీ పట్నంలో కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మౌలిక వసతులు మెరుగుపడి కొత్త పరిశ్రమలు వస్తాయని, ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు వ్యాపారాలు అభివద్ధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. హైదరాబా దులోని డిఆర్‌డిఓ ప్రాజెక్ట్ ఎంతో మంది యువకులకు ఉపాధి కల్పిస్తుందని, మరెందరో చిన్నచిన్న అనుబంధ పరిశ్రమలు పెట్టుకొని స్వయం ఉపాధి పొందు తున్నారన్నారు. రాబోయే రోజుల్లో అలాంటి అవకాశాలే దీని విషయంలో వస్తాయని శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సిహెచ్ సురేష్

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం : ఎస్ఐ

ప్రజాశక్తి-ఉంగుటూరు : మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాన్ని కోల్పోతారని ఆత్కూరు ఎస్ఐ సిహెచ్ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని ఆత్కూరు జిల్లా పరిషత్ పాఠశాల లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాన్ని వివరించడం కోసం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ ఐ సురేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని అంతటి ప్రమాదకరమైన వీటిని దరిచేరనవ్వరాదని అన్నారు. వీటిని నార్కోటిక్ డ్రగ్‌గా పిలుస్తారు అని, సమాజ శ్రేయస్సు కోసం వీటిని నియంత్రణ ఎంతో ముఖ్యమని, విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపు మాపేందుకు విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. భావి భారత పౌరులుగా ఎదగాలంటే క్రమశిక్షణతో ఉపాధ్యాయులు నేర్పే విద్యను అందిపుచ్చుకోవాలి అని తద్వారా మంచి భవిష్యత్తు దక్కుతుందన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవిబికె. సుధాకర్ మహేశ్వరి దేవి, బాలకష్ణ ,పి.సుజాత మరియు నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి. విజయరాణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వ్యాన్ డ్రైవర్లు భిక్షాటన



పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్ల సమ్మె నాలుగో రోజుకి చేరింది. కానూరు సెంటర్లో కార్మికులందరూ కలిసి షాపుల వద్దకు వెళ్లి బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పెనమలూరు మండలం సిఐటియు నాయకులు ఎస్‌కె మస్తాన్వలి మాట్లాడుతూ వ్యాన్ డ్రైవర్లకు మూడు నెలలు అవుతున్న ఇంతవరకు జీతాలు ఇవ్వపోవడం దారుణమని, వారి ఇళ్లు ఎలా గడవాలన్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి కార్మికులు జీతాలు ఇవ్వాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, వాన్ డ్రైవర్ల సిఐటియు నాయకులు. నరసింహారావు, వ్యాన్ డ్రైవర్ల సంఘం నాయకులు జి బ్రహ్మం, నవీన్, సత్రం శీను, నాగరాజు, కే రాంబాబు, పి కిషోర్ లింగయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం) : బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కె. ఐక్య సేవా సమితి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకష్ణ అన్నారు. నేత్ర వైద్య శిబిరాన్ని మారుతి రైస్ ట్రేడర్ అధినేత పొట్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమాన్ రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి సీతారాంప్రసాద్, పొట్లూరి శ్రీరామ్ మూర్తి, మున్నంగి శేషగిరిరావు, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డాక్టర్ ఇవాన్ శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. శంకర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ పి ఆర్ ఓ మురళీకష్ణ అనిల్, రంగయ్య అప్పారావుపేట గ్రామ సర్పంచ్ కాకొల్లు అన్నామణి, ఉప సర్పంచ్ నలిబోయిన శ్రీనివాసరావు, లింగం శ్రీధర్ పాల్గొన్నారు.



సిసి కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

కంకిపాడులో సిసి కెమెరాలు ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 లైవ్ సీసీ కెమెరాలను ఎస్పీ ఆర్ గంగాధర్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ సీసీ కెమెరాలలో కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారని, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ రెగ్యులేట్ ని కంట్రోల్ చేయటానికి, రోడ్డు యాక్సిడెంట్స్ డిటెక్ట్ చెయడానికి వీటి పాత్ర కీలకం గా ఉంటుందని అన్నారు. డిఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు, సీఐ మురళీకష్ణ, ఎస్ఐ డి సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి సహకరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ అభివద్ధికి సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడ అభివద్ధికి మంత్రివర్గమంతా ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి సత్యప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కంకిపాడు : అధికారులందరూ సమిష్టిగా పనిచేస్తూ తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గురువారం పెనమలూరు మండలం, తాడిగడపలోని బందరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన ఉన్న ద్వారక హోటల్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ పెనమలూరు నియోజకవర్గ శాసన సభ్యులు బోడే ప్రసాద్ తో కలసి తాడిగడప మున్సిపాలిటీ అభివద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు బోడే ప్రసాద్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, దీనికి తోడు పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు 328 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా పనులు సజావుగా సాగేందుకు అదనంగా మరో 75 మంది సిబ్బందిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు తగిన ఫైల్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదని, మున్సిపాలిటీ అభివద్ధికి సరైన ఆదాయ వనరులు లేవని, ఈ నేపథ్యంలో తక్షణమే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి, ఆస్తి పన్నులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త అంచనాలు తయారు చేసేందుకు సచివాలయ సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముందుగా వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని స్థానిక శాసన సభ్యులతో కలిసి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ అధికారి బిఎస్ హేలా షారోన్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ పి భవానీ ప్రసాద్, తహసిల్దార్ గోపాల్ కష్ణ, స్థానిక నాయకులు అనుమోలు ప్రభాకర్, ఇతర అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.1.03 కోట్లు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి హుండీల ద్వారా 1,03,85,016 రూపాయల ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆలయంలో హుండీలను లెక్కించారు.



సాధారణ హుండీల ద్వారా రూ.93,87,526, అన్నదానం ట్రస్టు హుండీ ద్వారా రూ.9,97,490 వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదానం పథకానికి గుంటూరు పట్టణంలోని కొరిటపాడుకు చెందిన కారసాని భద్రరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు వెంకట మంజునాథరెడ్డి రూ.లక్ష, శ్రీ అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడం తయారీ నిమిత్తం రూ.50 వేలు గురువారం ఆలయ కార్యనిర్వహణ అధికారి కిషోర్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్, రైతు బజార్లు పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలంలోని కంచల ఇసుక రీచ్‌ను జాయింట్ కలెక్టర్ నిధి మీనా పరిశీలించారు. ఇసుక రీచ్ వద్ద సీసీ కెమెరాలు షెడ్డు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న ఇసుకను నిబంధనల ప్రకారం ఇవ్వాలని, నిబంధన విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో బాలకృష్ణ, తహసిల్దార్ సురేష్‌బాబులకు తెలిపారు. అనంతరం నందిగామ పట్టణంలోని రైతు బజార్‌లో ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న ఉల్లి, టమాట, ఆయిల్ ప్యాకెట్ల ప్రత్యేక కౌంటర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డి, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులను ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం షాపులను గుడి, బడికి, హాస్పిటల్స్, ప్రజల నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ బి.గురవయ్య మాట్లాడుతూ మద్యం షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, మెటికల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పార్ట్ టైం ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : కస్తూరిబాయి గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం టీచర్లు, అకౌంట్స్, కుక్, నైట్ , డే వాచ్ ఉమన్ పోస్టులకు, ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అదనపు సమన్వయ కర్త జి.మహేశ్వరావు తెలిపారని రంగాపురం కెజిబివి విద్యాలయ ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, కుల, నివాస, విద్యార్హత పత్రాలు తీసుకుని విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని ఎంకె బేగ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

అన్నదానం

ప్రజాశకి-వన్‌టౌన్: దసరా పండుగ ముగింపు సందర్భంగా అమ్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక 48వ డివిజన్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు ఆర్.మాధవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట శ్రీ సిద్ధార్థ కళాశాలలో గురువారం మండల సేవాధికార సంస్థ తిరువూరు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తిరువూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మోతియా మాట్లాడుతూ పలు రకాల కేసులు గురించి వివరించారు. విద్యార్థులకు న్యాయవ్యవస్థపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం మోతియాకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మేకల నాగేంద్రప్రసాద్, చింతల వెంకటరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

'విజయ దీపం'తో విద్యార్థుల జీవితాల్లో వెలుగు

• ఎమ్మెల్యే సుజనాచౌదరి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నేటితరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపడానికి సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. సుజన ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్‌లు అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో గురువారం ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో విజయ దీపం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ దీపం కార్యక్రమం కింద చేపట్టే కార్యక్రమాల బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజనాచౌదరి మాట్లాడుతూ పది మంది విశ్రాంత ఐఏఎస్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్వాడీలు, పాఠశాలల్లోని బాలబాలికలు, టీచర్లు, అందరి అవసరాలకు అనుగుణంగా సరికొత్త విద్యా విధానానికి రూప కల్పన చేశారన్నారు. విద్యార్థుల శక్తి, సామర్థ్యాలను వెలికి తీసి వారికి ఇష్టమైన రంగాల్లో, రాణించేలా ప్రోత్సహించడం తద్వారా వారి జీవన జీవన



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎంపి పురంధేశ్వరి

నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సుజాన ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తాయన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న విజయ దీపం కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. ఈ విజయ దీపం కార్యక్రమం ద్వారా ప్రైమరీ పాఠశాల, హై స్కూల్ విద్యార్థుల సజనాత్మకతను పెంపొందించి వారిలోని ప్రతిభా పాటవాలను గుర్తించి వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాల కలనే ధ్యేయమన్నారు. ఎంపి దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ , క్రిస్ప్ సంస్థలు స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సుజనా ఫౌండేషన్ సీఈవో పివి రావ్, సలహాదారు వి.శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు క్రిస్ప్ ఫౌండర్ కన్నెగంటి సంధ్యారాణి, వేణుగోపాల్‌రెడ్డి, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, టిడిపి నేత నాగుల్ మీరా, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల నుండి నందిగామ వైపు వెల్లే రహదారిలో స్థానిక తానికొండ గార్డెన్స్ సమీపంలో ముందు



వెళ్తున్న కారును వెనుక నుండి వస్తైన్న కారు ఢీకొని ఫల్టీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచికచర్ల నుండి హైదరాబాద్ వైపై వెళ్తున్న కారు సర్వీస్ రోడ్డు నుండి హైవే ఎక్కుతుండగా, హైవే ఫ్లైవోవర్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు సర్వీస్ రోడ్డు నుండి వచ్చిన కారును వెనుక నుండి ఢీకొట్టగా అదుపు తప్పి ఫల్టీ కొట్టింది. ఈ సంఘటనలో హైదరాబాద్‌కు చెందిన దోనంరాజు సత్యవతి, వోలేటి రాధా రమేష్, కె.లక్ష్మీలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి కి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-విస్సన్నపేట: తాతకుంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలకు వస్తున్న తెగుళ్ళ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని ఎలా అధిగమించాలో పలు సూచనలను మరియు తీసుకోవాల్సిన చర్యలను జాగ్రత్తలను రైతులకు తెలిపారు.



ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు స్థానికంగానే శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి-నందిగామ

ఒకటి, రెండు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ స్థానిక మండల కేంద్రాల పరిధిలోనే నిర్వహించాలని పిఆర్‌టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 21 నుంచి నాలుగు విడతలలో జరగనున్న సాల్ట్ ప్రోగ్రాం ఎస్‌జిటిలను రెసిడెన్షియల్ పద్ధతిలో అంతర్ జిల్లా ప్రాతిపదికన వృత్యంతర శిక్షణను ఇవ్వాలని ఇప్పటికే అధికారులు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని ఇది ఏమాత్రం సరి అయినది కాదని, బాలింతలు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులకు ఏవిధమైన శిక్షణ ఇబ్బందికర దష్ట్యా ఉపాధ్యాయులు పనిచేస్తున్న మండల కేంద్రాలలోనే శిక్షణ నిర్వహించాలని కోరారు.

వాల్మీకి మహర్షి జయంతి

ప్రజాశక్తి-గంపలగూడెం: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించినట్లు స్థానిక లైబ్రరీ ఇంచార్జ్ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీవో ఎం.చెన్నయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **జగ్గయ్యపేట:** మండలంలోని గండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు వాల్మీకి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.



మైలవరంలో...

పట్టణంలోని చేగు విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధినేత కొత్తమాసు మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ రాయపూడి నరసింహారావు పాల్గొన్నారు. **కంచికచర్ల:** కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **మైలవరం:** డాక్టర్ లకిరెడ్డి హనుమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపల్ శ్రీపురంశెట్టి రంగారావు వాల్మీకి విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ మెండా దేవనంద్‌కుమార్, జె.రాముడు, డ్రి.శ్రీనివాస్‌రావు, టి.సాంబశివరావు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** ఏపీ జెన్కో శిక్షణ సంస్థలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్ కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.సుశీల, జనరల్ మేనేజర్ యు.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హరిబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీవో సునీత శర్మ పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి



గంపలగూడెంలో...

వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు. తిరువూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి పద్మావతి ఆధ్వర్యంలో పాఠకులు ఘనంగా నిర్వహించారు. **నందిగామ:** మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నందిగామ ఎంపిపి ఆకుల హనుమంతరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపిడిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో...

క్రీడా మైదానానికి నూతన సొగబులు


వాకింగ్ ట్రాక్


ఓపెన్ జిమ్

ప్రజాశక్తి-గన్నవరం : ఒకప్పుడు పిచ్చి మొక్కలు, పందుల సంచారంతో అపరిశుభ్రంగా, రాత్రి వేళలో మందు బాబులకు అడ్డాగా ఉండే గన్నవరంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం కొత్త రూపును సంతరించుకుంది. వాకర్స్ సమష్టి కషితో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం ఫలితంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఎల్డీ లైటింగ్ వ్యవస్థ, క్రీడా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో క్రీడా ప్రాంగణం వాకర్స్, క్రీడాకారులకు నిలయంగా మారింది. ఆరోగ్య కరమైన వాతావరణంలో వాకింగ్ చేసేందుకు ప్రతి రోజు వందలాది మంది క్రీడా ప్రాంగణానికి వస్తున్నారు. అంతే కాకుండా క్రీడలు ఆడేందుకు విద్యార్థులు. యువతతో పాటు పిల్లలతో ఆహ్లాదంగా గడిపేం దుకు కుటుంబాలు సైతం తరలివస్తున్నారు. ఫలితంగా గతంలో కళావిహీనంగా ఉన్న క్రీడా ప్రాం గణం పూర్వ వైభవం సంతరించుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచుతుంది.

క్రీడా మైదానానికి ఘన చరిత్ర

నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఉన్న ఈ క్రీడా మైదానానికి ఘన చరిత్ర ఉంది. గతంలో ఇక్కడ జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు కూడా జరిగాయి. ఎంతో మంది ఈ ప్రాం త క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిం చారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2008లో ఈ గ్రౌండ్లో గ్యాలరీ నిర్మాణం చేసింది. అనంతరం నిర్వ హణా లోపం కారణంగా క్రీడా ప్రాం గణం నిరుప యోగంగా మారింది. క్రీడా మైదానం అభివద్ధికి మూడేళ్ల క్రితం వాకర్స్ అసోసియేషన్ నడుం బిగించింది. పిచ్చి మొక్కలతో నిండిపోయిన గ్రౌండ్ను శుభ్రం చేశారు. వాకర్స్, దాతల సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేశారు. జిల్లా పరిషత్ నిధులతో వాకింగ్ ట్రాక్ చుట్టూ ఎల్డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కేవీఆర్ కిశోర్ నేతత్వం లోని నూతన కార్యవర్గం క్రీడా ప్రాంగణం రూపురే ఖలను మార్చింది. గ్యాలరీ కింద ఏర్పాటు చేసిన అసోసియేషన్ కార్యాలయాన్ని ఆధునీకరించడంతో పాటు పక్కనే ఉన్న గంగానమ్మ దిమ్మను, వాకర్స్ కూర్చునేందుకు వీలుగా బెడ్ టైల్స్ నిర్మాణం చేశారు. ఎంపీ నిధులతో గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్కు సుమారు రూ.5.50 లక్షలు వెచ్చిం చి బెడ్ కాంక్రీట్, టైల్స్, విద్యుత్ దీపాలు, పెయిం టింగ్స్, చుట్టూ రక్షణగా ఐరన్ మెష్ను ఏర్పాటు చేయడం జరిగింది.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాలీబాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాలీబాల్ క్లబ్ను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇస్తూ ఔత్సాహకులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి నెల క్రీడా ప్రాంగణం నిర్వహణ, పిచ్చిమొ క్కలు నిర్మూలనకు మందులు చల్లిస్తూ వేలాది. రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రౌం సదుపాయాల కల్పన, నిర్వహణ నిమిత్తం నూతన కార్యవర్గం రూ.9 లక్షల వరకు ఖర్చు చేసిం ది. అందులో వాకర్స్ సభ్యులు విరాళాలు రూపం లో రూ.2.75 లక్షలు ఖర్చు చేయగా, అధ్యక్షుడు కేవీ ఆర్ కిషోర్ రూ. 5.40 లక్షల ఖర్చు పెట్టారు. ఆరోగ్యవంతమైన సమాజం, క్రీడల అభివద్ధికి వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న కషిని పలువురు ప్రశంసిస్తున్నారు. గోడలకు వైట్ వాష్, గేట్లు, ఆట వస్తువులకు పెయింటింగ్స్ వేయించడంతో పాటు పచ్చ దానాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటారు.

మంచి కార్య క్రమాలు చేస్తాం.
కేవీఆర్ కిషోర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

గతంతో పోల్చితే వాకింగ్, వ్యాయామం, ఆటలు ఆడుకునేందుకు పెద్ద సంఖ్యలో జనం గ్రౌండ్కు వస్తున్నారు. ప్రజలందరి మేలు కోసం వాకర్స్ అసోసి యేషన్ ద్వారా క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయలను అందుబాటులోకి తీసుకువచ్చాం.



కిడ్నీ బాధితుడికి సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక ఇస్లాం పేటకు చెందిన కిడ్నీ బాధితుడు సుభానికి పినిశెట్టి నిరంజన్ ఫ్రెండ్ సర్కిల్ ఇరవై వేల ఐదువందల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం బాధితుని గహం వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సామాజిక ఆరోగ్య కేంద్రం అభివద్ధి కమిటీ సభ్యురాలు తోట దుర్గ ,ఆకుల రవి ,కాజా చేతన్ బాబు, డేవిడ్ గోల్కొండ, ఆకుల భరత్, సుధాని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగుపర్చాలి : మంత్రి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిర్వహణలో మార్పు కనపడాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వైద్యాధికారులను, పర్యవేక్షకులను ఆదేశించారు. గురువారం మంత్రి నగరంలోని తన నివాసంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల పనితీరు తెన్నులపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లోపల బయట పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. దాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసుపత్రి బయట చెత్తాచెదాలను తొలగించి మొక్కలు నాటాలన్నారు. అంబులెన్సులు రోగులను తీసుకుని వెళ్లే సమయంలో అధిక మొత్తాలు డిమాండ్ చేయకుండా రైల్వే స్టేషన్లో ఉన్న మాదిరిగా ధరలు నిర్ణయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ శ్రీనివాసు, ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, ఉప పర్యవేక్షకులు డాక్టర్ భానుమూర్తి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశాలత,ఏడి ఎన్రోస్ పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వేగవంతం చేయాలి

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి వారి నివాసంలో గిలకలదింది ఫిషింగ్ హార్బర్, మత్స్యశాఖ అధికారులతో హార్బర్ పురోగతి, మత్స్యశాఖ కార్యకలాపాలపై సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గిలకల దిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం రెండు సంవత్సరాలు అయినా ఎందుకు పూర్తి కాలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఇప్పటివరకు కేవలం 60 శాతం పనులు మాత్రమే అయ్యాయని ఇకపై పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ ఏఈ మహేష్, పి ఎం సి కన్సల్టెంట్ శశికుమార్, ఎఫ్డిఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన


పమిడిముక్కల మండలంలో శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ


గుడూరు మండలంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని గూడూరు, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాలలో గురువారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని సిమెంట్ రోడ్లకు శంఖుస్థాపన చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, దాసరి ఉమా సాయిరాం, కొలపల్లి రజిని,గోపి నాగబాబు, కాసగాని శ్రీను, అన్నం హరి, ఎన్ ఏ బేగ్, కట్ట మునేశ్వరరావు, పోతన రామోజీ, సర్పంచులు మొహమ్మద్ రఫీ, లింగం సులోచన రాణి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** గ్రామాల అభివద్దే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం పమిడి ముక్కల మండలంలోని గోపువానిపాలెంలో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, మైనేని శ్రీనివాసరావు, యార్లగడ్డ వీరభద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని చినగొన్నూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా హరిజనవాడ ఏరియా నందు సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. 2024-25 సంవత్సరానికి సంబందించి ఎం జిఎన్ఆర్ఈజిఎస్ నిధులతో కొత్తగా నిర్మాణం చేయబోయే సిసి రోడ్లు కు శంకుస్థాపన చేశారు. ఈ తాసిల్దార్ లోక రాజు , ఎంపీడీవో విజయసారథి, ఏఈ పీఆర్, ఏపీవో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెడన :** పెడనలో నిర్వహించిన కార్యక్రమంలో పెడన జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పంచకర్ల సురేష్, జనసేన మండలాధ్యక్షుడు ఊచ వెంకయ్య, పట్టణ పార్టీ సీనియర్ నాయకులు కూనపరెడ్డి రంగయ్య నాయుడు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉంగుటూరు :** పల్లెల అభివద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని మానికొండ, తరిగొప్పల, వేంపాడు, చాగంటి పాడు, నంద మూరు, ఇందుపల్లి, కొయ్యగూర పాడు, పొనుకుమాడు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మండల పార్టీ అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకట కష్ణారెడ్డి , జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్ , ఎంపిడివో ఈ సత్య కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అవనిగడ్డ : డిసెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని దీర్ఘకాలం కోట్లు చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవడంకంటే రాజీ ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఎలుకపాడు గ్రామంలో సిబిసిఎన్ సి పాస్టర్స్ , వెస్ట్ ఉయ్యూరు ఫీల్డ్ చర్చ్ అండ్ అవనిగడ్డ ఫీల్డ్ చర్చ్ ల సహకారంతో గురువారం 120 మంది వరద బాధిత కుటుంబాలకు చీర, టవల్, దుప్పటి, లుంగీలు పంపిణీ చేశారు. సిబిసిఎన్ సి చర్చి పాస్టర్ మున్నంగి నిరీక్షణరావు, బ్రదర్ నిత్యానందంల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబిసిఎన్ సి ఉయ్యూరు ఫీల్డ్ అధ్యక్షులు, పాస్టర్స్ కాన్ఫరెన్స్ ట్రెజరర్ రెవ ఫాదర్ తిరివీది పీటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన వస్త్రా లను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎం నిరీక్షణ రావు, పెద్దలు అమత రాజు, రమేష్, శిఖామణి, యెహెూషువ, శిఖామణి, దాసు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో తాగునీటి సమస్యపై ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ టిట్కో కాలనీలో తీవ్రమైన తాగు నీటి సమస్య ఉందని, వెంటనే తాగునీటి సమస్య తీర్చాలని మహిళలు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో కాలనీలోని బ్లాక్ నెంబర్ ఎ28లో తాగునీరు రావడం లేదని అధికారులను చెబితే పట్టించుకోవడంలేదన్నారు. ట్యాంకులు కూడా రెండు మూడు అపార్ట్మెంట్లకు దూరంగా ఆపుతున్నారని, అంత దూరం నుంచి మోసుకొని తెచ్చుకోవాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజువారి కూలీకి వెళ్లే వాళ్ళు ఉన్నామని నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక పనులు మానేసుకొని ఉండాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అలాగే డ్రైనేజీలో నీరు పారుదల లేక మురుగు వాసనకి ఉండలేకపోతున్నామన్నారు. ఈ సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి రజిని, బిల్డింగ్ రంగనాయకుడు ఆర్ కొండ, పి అనిత, జి రమ, టీ వీరమ్మ, సత్యవతి, జి శివమ్మ, పి రాజేశ్వరి దేవి, జి లక్ష్మి, ఎస్ వెంకటరమణ, పి రాణి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

వరద బాధితులందరికీ పరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతం 17వ డివిజన్‌లోని తారక రామానగర్‌లో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. వరదలో సర్వం కోల్పోయామని, ఇళ్లన్నీ దెబ్బతిన్నాయని, సామాన్లు కూడా చేతికి రాలేదని, పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ గత నెల రోజుల నుంచి తిరుగుతున్నా ఫలితం లేదని, తమకు న్యాయం జరగలేదని నాయకుల ఎదుట బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంత బాధిత ప్రజలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోకుంటే, వారిని కలుపుకొని ఆందోళన చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. నెల రోజులు గడిచినా సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని బాధిత ప్రజలు వివరిస్తున్నారన్నారు. అధికారులు కూడా ఎన్యుమరేషన్ సరిగా చేయలేదన్నారు. ఒక పక్క ప్రభుత్వం బాధితులందరికీ పరిహారం ఇచ్చామని చెబుతున్నా సగానికిపైగా బాధితులు పరిహారం అందలేదని చెబుతున్నారు. నెలలు గడిచినా ఎదురుచూపులు మిగిలాయని, నిండా మునిగిపోయిన బాధితుల పట్ల ఈ వైఖరి సరికాదన్నారు. బాధితులు అనేక సార్లు స్థానిక సచివాలయంలో, కలెక్టర్ కార్యాలయంలో అప్లికేషన్లు పెట్టినా వారికి సరైన సమాధానం తెలపలేదు. మరోసారి ఇళ్లకు వచ్చి విచారించి ఇళ్లలో ఉండి నష్టపోయిన అర్హులందరికీ పరిహారం అందించేలా చూడాలన్నారు. ఇళ్లు దెబ్బతిన్న, చిరు వ్యాపారులు నష్టపోయిన వారికి పరిహారం అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు తమ్మిన చంద్రశేఖర్, స్థానిక నాయకులు కోటి రెడ్డి, కందుకూరి వెంకటేశ్వరరావు, ఆధాం తదితరులు పాల్గొన్నారు.


తారక రామానగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



సెమీ కండక్టర్‌పై వర్కుషాప్ ప్రారంభం

ప్రజాశకి-వన్‌టౌన్: భారతదేశం సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సి.ఎ.చిట్టా అమర్ సుధీర్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల వర్క్‌షాప్ ఆన్ విఎల్ఎస్ఐ - డిజైన్ ఫర్ టెస్టాబిలిటీ అండ్ ఫిజికల్ డిజైన్ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రెసిడెంట్ పొట్టి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న సాంకేతిక ఫలాలు సామాన్యులకు చేరువైనప్పుడే వాటికి సార్ధకత లభిస్తుందని, విఎల్ఎస్ఐ ఫర్ టెక్టబులిటీ ద్వారా లోపాలను మరియు ఉత్పత్తిని వినియోగదారులకు చేరేముందు డిజైన్ లోపాలను పరిష్కరించడానికి ఉపయోగపడేలా ఈ వర్క్‌షాప్ నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. కళాశాల ట్రెజరర్ కె.రాఘవయ్య మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఎల్లప్పుడూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేసే ఇలాంటి వర్క్ షాప్ నిర్వహించడానికి కళాశాల మేనేజ్మెంట్ ఇప్పుడు ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ టెక్నాలజీస్, ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ డైరెక్టర్ ఉపేంద్రరావు, డాక్టర్ షేక్ అప్రఫలీ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌పతాంజలి శాస్త్రి, కన్వీనర్ డాక్టర్ డి.కృష్ణ, పి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణ

ప్రజాశకి-వన్‌టౌన్: పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి దేవస్థానం నుండి నిర్వహించిన ఇంద్రకీలాద్రి 'గిరి ప్రదక్షిణ' కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ఆలయ ఈవో కెఎస్ రామారావు గిరిప్రదక్షిణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆలయ సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు. కోలాట, భజన, నాట్యం, మంగళ వాయిద్యాల నడుమ కన్నులవిందుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం సాగింది.

దుర్గగుడి హుండీల లెక్కింపు

ఇంద్రకీలాద్రి మహామండపం ఆరవ అంతస్తులో రెండో రోజు గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. నగదు రూ. 2,76,68,347, బంగారం 140 గ్రాములు, వెండి 6.498 కిలోలు యాత్రికులు కానుకల రూపంలో సమర్పించారు. యుఎస్ఎ 70 డాలర్లు, యూరప్ 5 యూరోస్, ఒమాన్ 1 రియాళ్, 800 బైసా, ఇంగ్లాండ్ 15 పౌండ్లు, ఫిజీ 20 డాలర్లు, సౌదీ 1 రియాల్, ఇంగ్లాండ్ 15 పౌండ్లు వచ్చాయి. ఆలయ ఈవో కె ఎస్ రామారావు, డీప్యూటీ ఈవో రత్నరాజు, దేవాదాయ శాఖ అధికారులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీన కూడా హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ రామారావు తెలిపారు.



డ్రోన్లతో ట్రాఫిక్ రద్దీ గుర్తింపు



ప్రజాశకి-వన్‌టౌన్: విజయవాడ సిటీలో రాను రాను పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రణ చేయడానికి నగర ట్రాఫిక్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు డ్రోన్ కెమెరాను ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ రద్దీని గుర్తించే చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ డిసిపి కష్ణమూర్తి పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏడిసిపి ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు వన్ ట్రాఫిక్ ఏసిపి పి రామచంద్రరావు ఆధ్వర్యంలో విజయవాడ వన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రకాశం బ్యారేజీ, మరియు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా ఎక్కడెక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నది, తక్కువగా ఉన్నదో ఈ యొక్క డ్రోన్ కెమెరా ద్వారా వన్ ట్రాఫిక్ సిఐ ఏ. ఉమామహేశ్వరరావు తన సిబ్బందితో పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు చేపట్టడానికి వీలుగా సదరు డ్రోన్ కెమెరా యొక్క టెక్నాలజీని వినియోగించారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ డ్రోన్ కెమెరా ఆపరేటర్ కానిస్టేబుల్ మహేంద్ర, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. డోర్ టూ డోర్ కలెక్షన్ లేక కాలనీలలో రోజురోజుకి పరిస్థితి దయనీయంగా మారుతోందన్నారు. సెంట్రల్లో ముఖ్యంగా వాంబేకాలనీ, న్యూఆర్ఆర్ పేట, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని.. చిన్న సందులోనే దాదాపు ఐదారు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని.. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కాలనీల్లోని జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వారం రోజులుగా చెత్త సేకరణ వాహనాలు కనిపించకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

శిశువు వైద్యానికి సాయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని సత్యనారాయణపురంనకు చెందిన చదల వెంకట మహేశ్వర రావు దంపతులకు పుట్టిన శిశువుకు 14 రోజులకే జ్వరం వచ్చి ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. గత నెలలో శిశువుకు ప్లేట్లెట్స్ పడిపోయి పరిస్థితి విషమించడంతో కొంతమంది సూచన మేరకు మెరుగైన చికిత్సకు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో గత నెల 28వ తేదీన టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి వెళ్లి మంత్రి నారా లోకేష్‌ని కలిసి ఆదుకోవాలని అభ్యర్థించారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి సిఎం సహాయనిధి మంజూరు చేశారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న శిశువును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని కాపాడండి

డిఆర్‌ఒకు పూర్వ విద్యార్థుల వినతి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలకు చెందిన స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు గులాబీతోట ఉన్న స్థలాన్ని కాపాడాలని ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఈ స్థల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు దోనేపూడి కాశీనాథ్, దోనేపూడి శంకర్, సంఘం అధ్యక్షులు లంకా జానయ్య, కార్యదర్శి చిరుగుపాటి యుగంధర్, ఉపాధ్యక్షులు ఆళ్ల వేణుగోపాల్, వెలగా జోషి తదితరులు మాట్లాడుతూ ఆక్రమణ దారులు ప్రభుత్వ స్థలాన్ని తమదని చెప్పుకోవటం దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. తక్షణమే కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ యంత్రాంగం, పూర్వ విద్యార్థులు చేసే న్యాయమైన పోరాటానికి అండగా నిలబడాలని కోరారు. విజయవాడ నగర ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, కళాశాల ప్రస్తుత విద్యార్థులు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. త్వరలోనే విద్యాశాఖా మంత్రిని, రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థులు సాగిస్తున్న పోరాటానికి తాను అండగా ఉంటానని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. ఇటీవల కళాశాలకి చెందిన స్థలం లేదని తమ స్థలమే ఉందని ఆక్రమణదారులు పత్రికాముఖంగా చెప్పటాన్ని పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని భవిష్యత్తు తరాల అవసరం కోసం రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థుల సంఘం నేతలు